**పుత్రులుంటే పున్నామ నరకాన్నుంచి తప్పిస్తారని ప్రతి తల్లీ, తండ్రీ ఆశిస్తారు. కొడుకులు కొరివి పెట్టే క్షణం కోసం వారి ఆత్మలు ఎదురు చూస్తాయి. కాని నలుగురు కొడుకులుండీ ఆ దంపతులకు ఒరిగిందేమిటి?**






# పున్నామ నరకం

ప్రాజిత

"విశారదా! విశారదా!" పిలిచాడు పావనమూర్తి.

దగ్గరే కూర్చుని ఆయన గుండె మీద చిన్నగా మర్దనా చేస్తున్న విశారద - "ఊఁ ఏవిఁటండీ?" అని అడిగింది.

"వచ్చారా ... వాళ్ళొచ్చారా?"

"వచ్చేస్తారు. మీ రేమీ బాధపడకండి. ఈపాటికి టెలిగ్రాములు అందే ఉంటాయి. వెంటనే బయలుదేరి వస్తారు. మీరు ... మీరు విశ్రాంతిగా ఉండండి" అంది దుఃఖాన్ని అవుకుంటూ.

"ఇం కెక్కడి విశ్రాంతి? ఒకే ఒక విశ్రాంతి. కడసారి విశ్రాంతి." అన్నా డాయన పేలవంగా నవ్వుతూ.

విశారద కళ్ళల్లో నిండిన కన్నీరు జారి ఆయన గుండెల మీద బొటబొటా పడింది.

నెమ్మదిగా కళ్ళు తెరిచి భార్య వైపు చూసి, "ఏడుస్తున్నావా? పిచ్చిదానా! ఎందుకు ఏడవటం? ఏడవకు! ఇక నీ ఒంటరి ప్రయాణంలో ఈ ఏడ్పును తోడు చేసుకోకు. ధైర్యంగా ఉండు. అలా ఉండటానికే ప్రయత్నించు. దుఃఖం మనిషిని కృంగదీస్తుంది. అందుకే ఆ దుఃఖాన్ని దూరంగా ఉంచి నీ జీవన యాత్ర సాగించు. పుట్టినప్పుడు అందరం ఒంటరి వాళ్ళమే. పోయేప్పుడూ అందరం ఒంటరి వాళ్ళమే. కానీ పుట్టీ - పోయే మధ్య ప్రయాణంలోనే ఈ బంధాలు, అనుబంధాలూను. నీ వేడవకు విశారదా! నేను చూడలేను. నీతో కలసి ఏడడుగులు నడిచినందుకే నా జీవితాన్ని పూలపాన్పులా పరిచి సుఖ సంతోషాల్ని ఇచ్చిన దేవతవు నీవు. నీ దుఃఖాన్ని చూస్తూ పోతే నా ఆత్మకు శాంతి ఉండదు."

"అలా మాట్లాడకండి, మీరు ... మీరు లేనిదే నేను బ్రతకలేను" ఆయన గుండెమీద పడి బోరుబోరున విలపించిం దామె.

అయన రెండు చేతులతో ఆమె తల మీద నిమురుతూ కళ్ళు మూసుకున్నాడు.

** ** **

పావనమూర్తి, విశారద అన్యోన్య దంపతులు. వాళ్ళకి నలుగురు మగపిల్లలు, ఒక అమ్మాయి. అందరికీ మంచి చదువులు చెప్పించి పెళ్ళిళ్ళు చేశారు. అందరూ పెద్ద పెద్ద పదవుల్లో ఉన్నారు. కాని ఒక్కరు కూడా వీళ్ళు ఉంటున్న గ్రామానికి

అందుబాటులో లేరు. పెద్ద పెద్ద సిటీల్లో ఉన్నారు. పావనమూర్తి ఆరోగ్యం బాగాలేదు. పిల్ల లందరినీ చూడాలని లెటర్లు రాశారు. కాని ఏ ఒక్కరూ అంత తొందరగా ఆయన్ని చూసేందుకు రాలేదు.

కారణం వాళ్ళకు తీరిక లేదు, సెలవు లేదు. ముఖ్య కారణం మనసు లేదు. 'ఆఁ ఆ పల్లెటూరికి ఎవరు పోతారులే' అనే నిర్లక్ష్యం. ఇప్పుడు సీరియస్‌గా ఉందని టెలిగ్రాములు అందరికీ ఇప్పించారు. ఇప్పటికైనా వాళ్ళు వస్తారా అనే ధ్యానతోనే ఆ ముసలి దంపతులు ఎదురు చూస్తున్నారు.

మధ్య తరగతి కుటుంబీకుడైన పావనమూర్తి పిల్లల భవిష్యత్ కోసమయితేనేమి, వాళ్ళ చదువులూ, పదవులూ, ఆరోగ్యాలకోసమయితేనేమి పడరాని పాట్లు పడ్డాడు.

కొడుకులు వాళ్ళని ఆ పల్లెటూరు వదలి వాళ్ళ దగ్గరకు వచ్చి ఉండమంటారు. కాని ఆ దంపతులు వెళ్ళరు. మామూలే. అక్కడ కెళ్ళిన రెండు రోజులకే కొడుకులు మొహమాట పలకరింపులూ, మొక్కుబడి నవ్వులూ. ఆ తరువాత కోడళ్ళ మూతి విరుపులూ, ఈసడింపులూ అవీ భరించలేక ఆ పల్లెసీమలో వాళ్ళు కట్టుకున్న చిన్న కుటీరంలో వాళ్ళ చిన్నప్పటి జ్ఞాపకాలను తలుచుకుంటూ కాలం గడిపేవారు. భుక్తి కోసం కష్టపడాల్సిన అవసరం లేదు. ఉన్న పొలం చూసుకుంటూ పెన్షన్‌తో కాలం గడిపేవారు. కొబ్బరి చెట్లూ, మామిడితోటతో వచ్చే ఫల సంపద పిల్లలకు అందిస్తుంటారు. ఆ ఊరివాళ్ళకు పావనమూర్తంటే చాలా గౌరవం. ఆ గౌరవం పొందే అర్హతను ఆయన సంపాదించుకున్నాడు. విశారద కూడా చల్లని తల్లి అని పేరు పొందింది.

ఆ దంపతుల ఎదురు చూపులతోనే సంధ్య వేళ కావచ్చింది. ఇంకా ఎవరూ రాలేదు.

"విశారదా! మన పిల్లల్ని కడసారి చూసే అదృష్టం నా కుందంటావా?"

"వాళ్ళు తప్పక వస్తారండీ! ఎంతైనా పిల్లలు. మన రక్తం పంచుకు పుట్టిన వాళ్ళు, మన ప్రేమలు పొందినవాళ్ళు. వాళ్ళు రాకపోతే ఈ సృష్టిలో ఇక ఏ బాంధవ్యాలకూ విలువ లేదు" అం దామె.

పావనమూర్తి కళ్ళు భారంగా మూతలు పడ్డాయి.

** ** **

"అబ్బా! ఈ పల్లెటూర్లో ఉండకపోతే నేమి? ఆ పెద్దవాళ్ళు చెబితే వినిపించుకోరు. టెలిగ్రాం ఇచ్చేస్తే సరేనా? మనం వచ్చేందుకు ఎంత అవస్థ! అని ఒకరూ!

'ఇలా టెలిగ్రాం ఇచ్చి ఈ పల్లెకు రప్పించుకోవటం చాలా ఘనత కాబోలు' అని ఒకరూ!

'ఆయన చచ్చేది అలా ఉండనీ, ఈ గతుకుల రోడ్డులో ఈ బళ్ళలో ఆ ఇల్లు చేరేసరికి మన ప్రాణాలు పోతా'యని ఒకరూ!

'పిల్లలకు ఇప్పుడే ఎగ్జామ్స్! ఇప్పుడే ఆయన పోయేందుకు పుణ్య 'కాలం రావాలా' అని






మరొకరూ కోడళ్ళు కామెంట్స్ చేస్తూ ఇల్లు చేరారు.

"మీ అమ్మా వాళ్ళకు కొంచెం కూడా మర్యాద తెలియదు. ఒక బండైనా పంపరు. పోనీ కారులో వద్దామంటే ఈ ఊరికి రోడ్డు సరి లేదాయె" అని సనుక్కుంటూ అల్లుడు కూడా ఇల్లు చేరాడు.

కానీ వీళ్ళందరూ ఇల్లు చేరేప్పటికి పావనమూర్తి ఊపిరితో లేడు. అంతవరకు పిల్లల కోసం అలమటించిన ఆయన ప్రాణం పంచభూతాల్లో కలసిపోయింది. విశారద గొల్లున ఏడుస్తోంది. అందరూ బోరున విలపించారు.

పావనమూర్తి చితికి నిప్పు పెట్టే సమస్య తలెత్తింది. పెద్ద కొడుకు రాలేదు. ఆఫీసు పని మీద దూర ప్రదేశానికి వెళ్ళాడు. మెసేజ్ అంది వచ్చేసరికి రెండు రోజులు పట్టవచ్చు. చివరివాడు దుబాయ్ వెళ్ళాడు. మిగిలింది రెండోవాడు, మూడోవాడు. రెండోఆయన ఉద్యోగం అలాంటిది. ఒక్కరోజు సెలవు, తీరిక ఉండవు. అందుకే తమ్ముడిని పెట్టమన్నాడు. "నాకు మటుకు టైం ఎక్కడుంది? కనుక నీవే పెట్టు" అని చెప్పాడు. "నీవు పెట్టంటే, నీవు పెట్టు" అని వాదానికి దిగారు. ఇక ఇంటి అల్లుడు ఈ తమాషా చూస్తూ జాలీగా ఉన్నాడు.

"ఇందరు కొడుకులుండీ కూడా ఇలాంటి పరిస్థితి తెచ్చారు. నాన్నగారు మన కోసం ఎన్నెన్ని చేశారు. నేను పెడతాను" అంటూ అభ్యుదయవాదిగా ముందుకు వచ్చింది కూతురు.

అల్లుడు ఆకాశమంత ఎత్తున లేచాడు. "ఆడవాళ్ళు చితిపెట్టడం మా ఇంటా, వంటా లేదు. ఇలాంటి పనులు చేసి మా ఇంటి కోడలుగా గౌరవాన్ని పోగొట్టుకుంటావు" అని ఎగిరి కేకలేశాడు.

ఇలా తర్జన భర్జనలు జరుగుతూనే ఉన్నాయి. రాత్రయిపోయింది. ఆ వాదులాట పూర్తి కాలేదు.

విశారదమటుకు ఆయన మీదే పడి రోదిస్తోంది.

తెల్లవారితే తతంగం.

"నీవే పెట్టాలి ... నీవే పెట్టా" లని చూపులతోనే ఆవేశాలను వ్యక్తపరచుకుంటున్నారు. అర్ధరాత్రి దాటింది. అందరూ ఆరుబయట అలసి ఎక్కడివా రక్కడ సొమ్మసిల్లినట్లున్నారు.

తెల్లవారి మూడు దాటింది. ఇక అందరూ లేవబోతున్న సమయంలో అగ్ని తన ప్రభావాన్ని చూపి మంటలు మండిస్తోంది. కొత్త గుడ్డలు కాలిన వాసన!

అందరూ లోపలకు పరుగెత్తారు. అక్కడే చితిపేర్చినట్లు మంటలు భగభగ మండుతున్నాయి.

భర్తమీద పడి రోదిస్తున్న విశారద కూడా ఎప్పుడో ప్రాణం విడిచింది. అది ఎవరూ గమనించనే లేదు.

ప్రాణం లేని ఆమె పైట కొంగు గాలికి తల దగ్గరున్న దీపానికి తగిలి అంటుకుంది. ఆ పుణ్య దంపతులకు అదే చితిగా అయి కాల్చింది.

మనసులేని వాళ్ళ చేత చితికి నిప్పు పెట్టించుకోవడం కన్నా అగ్ని చేసిన ఆశీర్వాదమే ఎంతో గొప్పదని వాళ్ళ ఆత్మలు నిండుగా నవ్వుతున్నాయి చితిమంటల్లో!

★